సాక్షి
తిరుపతి
గురువారం । 1 । మే । 2025



పెండింగ్ కేసులకు ప్రాధాన్యం

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు బుధవారం ఆదేశించారు. - 8లో



గంగమ్మ గుడి హుండీ లెక్కింపు

శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి హుండీ ద్వారా ఆదాయం రూ.13,50,612 లభించింది. - 8లో



అంతర్రాష్ట్ర మోసగాడి అరెస్ట్

తిరుమలలో మాంగల్య పూజల పేరుతో పలువురిని మోసం చేసిన అంతర్రాష్ట్ర నేరగాడిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి పింఛన్ల పంపిణీ



వెంకటేశ్వర్, కలెక్టర్

తిరుపతి అర్బన్ : ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను గురువారం ఉదయం 7 గంటల నుంచి పంపిణీ చేయాలని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తొలిరోజే వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు. మొత్తం 2,61,230 మందికి రూ.111.84 కోట్లు అందించనున్నట్లు వెల్లడించారు. డీఎల్‌డీఓ, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని సూచించారు. పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రశాంతంగా పాలిసెట్

– 87.56శాతం మంది విద్యార్థులు హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి విద్యార్హతతో పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి ఏటా రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ నిర్వహించే పాలిసెట్–2025 ప్రవేశ పరీక్ష బుధవారం జిల్లా వ్యాప్తంగా 15 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. ఈ పరీక్షకు తిరుపతి జిల్లా నుంచి మొత్తం 5,299 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. తిరుపతిలో 8, గూడూరులో 5, సత్యవేడులో 2 చొప్పున పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ ఎ.నిర్మల్‌కుమార్ ప్రియ, జిల్లా పరిశీలకులు డాక్టర్ సత్యనారాయణరెడ్డి, డాక్టర్ ఎంఆర్ ధీరేంద్రబాలు, పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్ పర్యవేక్షణలో పాలిసెట్ ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. ఈ పరీక్షకు తిరుపతిలో 3,778 మందికి 3,363(89.09శాతం)మంది, గూడూరులో 1,221 మందికి 1,037 (84.9శాతం) మంది, సత్యవేడులో 300 మందికి 240(80శాతం) మంది, మొత్తం 5,299మందికి 4,640(87.56శాతం) మంది హాజరుకాగా, తిరుపతిలో 415 మంది, గూడూరులో 184 మంది, సత్యవేడులో 60 మంది గైర్హాజరైనట్లు పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ తెలిపారు.

అధ్యాపకుల పాత్ర కీలకం



అధ్యాపకులతో సంఘటన కార్యదర్శి లక్ష్మణ్

తిరుపతి సిటీ: జాతీయ నూతన విద్యావిధానం అమలులో అధ్యాపకులది కీలక పాత్రని అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ (ఏబీఆర్ఎస్ఎమ్) జాతీయ సహ సంఘటన కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. బుధవారం జాతీయ సంస్కృత వర్సిటీలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైవీరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి పలు అంశాలపై చర్చించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాలు, శిక్షణ, పరిశోధనలు మెరుగుపడతాయన్నారు. దీంతో మన వర్సిటీలు ప్రపంచ విశ్వ విద్యాలయాలతో పోటీపడే పరిస్థితి వస్తుందని వెల్లడించారు. భారతదేశ విద్యా రంగంలో సవాళ్లు, మార్పులు అనే అంశంపై జూలై 26, 27 చెన్నైలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎమ్ రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ బుల్లిదాస్, డాక్టర్ బాలసుబ్రమణ్యం, ప్రతినిధులు డాక్టర్ రమేష్, డాక్టర్ చందూలాల్, డాక్టర్ శ్రీ లేఖ, డాక్టర్ కుమార్, డాక్టర్ సంధ్య, డాక్టర్ వివేక్, డాక్టర్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నూతన కోర్సులు అవసరం



సదస్సులో మాట్లాడుతున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: విద్యార్థులకు ఉపాధే లక్ష్యంగా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ అందించి అధునాతన అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు తీసుకురావాలని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు సూచించారు. బుధవారం ఢిల్లీ వేదికగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగ భవిష్యత్ – నూతన రంగాలలో కోర్సులు అనే అంశంపై చేపట్టిన రెండు రోజుల సదస్సులో ఆయన మాట్లాడారు. కొత్త టెక్నాలజీ, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో కొత్త కోర్సులు తీసుకురావాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కోర్సులను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, పరిశ్రమల మధ్య అనుసంధానం పెంపొందించి కోర్సులు రూపొందించడం, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు చేయించాలని కోరారు. ఉపాధ్యాయుల శిక్షణ, డిజిటల్ మాధ్యమాల వాడకం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సదస్సులో ఎస్వీయూ నుంచి రూసా కో–ఆర్డినేటర్ రమశ్రీ, సీఈఓ వంశీ రాయల్ పాల్గొన్నారు.



చిల్లకూరు మండలం నాంచారమ్మపేట వద్ద చెరువులో యంత్రాలతో తవ్వకాలు

ఖతం.. ఖనిజం

- ఇష్టారాజ్యంగా ప్రకృతి వనరుల దోపిడీ
- అక్రమంగా క్వార్ట్జ్, ఇసుక, మట్టి.. సిలికా తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు
- యథేచ్ఛగా దందా సాగిస్తున్న పచ్చమూక

రెచ్చిపోతున్న కూటమి నేతలు

“అంతా మా ఇష్టం.. అడిగేవారే లేరు.. అడ్డుకునే సాహసం ఎవరికీ లేదు.. అధికారులందరూ మావాళ్లే”.. అంటూ కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. అసైన్డ్.. డీకేటీ.. ప్రభుత్వ భూములనే తేడా లేకుండా ఖనిజం కనిపిస్తే తవ్వేస్తున్నారు. ఇష్టారాజ్యంగా అమ్మేసుకుని సొమ్ముచేసుకుంటున్నారు. ప్రజాప్రతినిధి అండదండలతో అందరిపై పెత్తనం చెలాయిస్తున్నారు. అనుమతులతో పనిలేకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రకృతి వనరులను దోచుకుంటున్నారు. ఆయా శాఖల అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు.

చిల్లకూరు : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత క్వార్ట్జ్, ఇసుక, గ్రావెల్, సిలికా తదితర వనరులను అధికార పార్టీ నేతలు అక్రమంగా తవ్వేస్తున్నారు. నిత్యం వందల టిప్పర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి పనిలో స్థానిక ప్రజాప్రతినిధి అండగా ఉండడంతో కూటమి నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గూడూరు నియోజకవర్గంలోని అసైన్డ్, డీకేటీ ప్రభుత్వ భూముల్లో ఎక్కడ ఖనిజం ఉంది అని తెలిస్తే అక్కడ గద్దల్లా వాలిపోతున్నారు. రాత్రికి రాత్రి తవ్వకాలు చేపట్టి తరలించేస్తున్నారు. దీనిపై ఏ శాఖ అధికారి కూడా కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో తాము ఏం చేసినా అడిగేవారు లేరు.. అనుమతులతో మాకేంటి పని అనే ధీమాతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలలో దాదాపు ఇదే పరిస్థితి. గూడూరు మండలంలో క్వార్ట్జ్, గ్రావెల్ విస్తారంగా లభిస్తోంది. చిల్లకూరు మండలంలో మట్టి, సిలికా, గ్రావెల్ అందుబాటులో ఉంది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలలో ఒక వైపు స్వర్ణముఖి నది ప్రవహిస్తుండడంతో అక్కడ పుష్కలంగా ఇసుక దొరుకుతోంది. కోట, చిట్టమూరు మండలాలలో గ్రావెల్ కూడా లభ్యం అవుతుండడంతో కూటమి నేతల అక్రమార్జనకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

గ్రావెల్‌కు రహదారి

నియోజకవర్గవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గ్రావెల్ ఇబ్బడిముబ్బడిగా దొరుకుతోంది. దీంతో కూటమి నేతల అక్రమార్జన మూడు జేసీబీలు, ఆరు టిప్పర్లు అనే రీతిలో సాగుతోంది. జాతీయ రహదారిపైనా గ్రావెల్, మట్టి లోడ్‌లతో టిప్పర్లు కనిపిస్తున్నా గనులు, పోలీసు శాఖ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. అధిక లోడ్‌తో విపరీతమైన వేగంతో వెళ్లే ఈ టిప్పర్లను నిలిపేందుకు సైతం భయపడుతున్నారు.



గ్రావెల్ తవ్వకాలతో గుల్లగా మారిన ప్రభుత్వ భూమి

వరంలా మారిన సాగరమాల

సాగరమాల పేరుతో జాతీయ రహదారులు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇదే అదునుగా రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు ఆయా మార్గాలలోని పేదల భూములను చదును పేరుతో కారు చౌకగా కొనుగోలు చేసేశారు. అందులో 30 అడుగుల మేర తవ్వకాలు చేసి మట్టి, గ్రావెల్ తరలించుకు పోతున్నారు. దీన్ని సాకు చూపిన కూటమి నేతలు సైతం అనధికార లేఅవుట్‌లకు మట్టి, గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో నిత్యం వందల టిప్పర్లతో వనరుల అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే సాగరమాల రహదారి కాంట్రాక్టు సంస్థకు చెందిన వాహనాలని చెప్పి తప్పించుకు పోతున్నారు. ఈ క్రమంలో ఎలాంటి అనుమతులు లేకుండా వనరుల తవ్వకాలు, తరలింపుపై సంబంధిత శాఖల అధికారులను వివరణ కోరేందుకు యత్నించగా ఎవరూ స్పందించకపోవడం గమనార్హం.

ఉచితం లేదు.. నేతలదే పెత్తనం

కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టింది.అయితే ఎవరికీ ఉచితంగా ఇసుక దొరకడం లేదు. క్షేత్ర స్థాయిలో రీచ్‌ల వద్ద కూటమి నేతల పెత్తనం సాగుతోంది. రీచ్‌లలో ట్రాక్టర్ ఇసుకకు రూ.1,200, టిప్పర్‌కు రూ.40 వేలు వసూలు చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఇసుక లేదని తరిమేస్తున్నారు. ఈ విషయంలో సైతం కూటమి నేతలు అందించే మామూళ్లకు అలవాటు పడిన అధికారులు సాధారణ ప్రజలకు నష్టం చేకూరుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కన్నెత్తి చూడరు

ఇసుక, గ్రావెల్, మట్టి, క్వార్ట్జ్, సిలికా తవ్వకాలపై ఒక్క అధికారి కూడా కనీసం కన్నెత్తి చూడడం లేదు. అనుమతులు లేకుండా ఖనిజాలను తరలించుకు పోతున్నారని ఫిర్యాదులు అందినా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ భూమిలో మట్టి, గ్రావెల్ తవ్వేస్తున్నారని రెవెన్యూ గనులశాఖ అధికారుల దృష్టికి తీసుకెళితే.. అది పట్టా భూమయ్యా అని తేల్చేస్తున్నారు. ఇక ఇరిగేషన్ చెరువుల్లో మట్టి తవ్వకాలకు గోరంత అనుమతి ఇస్తే దానిని కొండంతగా తవ్వేసి తరలించేస్తుంటారు. అనుమతి ఇచ్చిన ఏఈ స్వయంగా తవ్వకాలను పర్యవేక్షించాలి. అయితే మామూళ్లు తీసుకుని అధికారులు అటువైపు కనీసం చూడడం లేదు.

నిఘా కరువు

అత్యంత విలువైనా మైకా క్వార్ట్జ్ గూడూరు మండలంలో చెమిర్తి, తుంగపాళెం, , వెందోడు, వెడిచెర్ల,పాలిచెర్ల, కొండాగుంట, తిరువెంగళాయపల్లి, కొమ్మనేటూరు, మంగళపూరుతో పాటుగా పలు ప్రాంతాలలో లభ్యం అవుతోంది. అధికారుల నిఘా లేకపోవడంతో కూటమి నేతలు అక్రమంగా రాత్రి సమయంలో బ్లాస్టింగ్‌లు చేసి తవ్వేస్తున్నారు. దీనిపై స్థానికులు పలు మార్లు పోలీస్, గనులశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు.



స్వర్ణముఖిలో ఇసుకను ట్రాక్టర్‌లలో లోడ్ చేస్తున్న దృశ్యం



గూడూరు మండలంలో మైకా క్వార్ట్జ్ అక్రమ తవ్వకం



కోట మండలంలో ఇసుక తవ్వుతున్న జేసీబీ

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం కమిటీలో జిల్లా నేతలు

తిరుపతి సిటీ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీని బుధవారం ప్రకటించారు. ఇందులో తిరుపతి జిల్లాకు చెందిన చిట్టేటి హరికృష్ణ సెక్రటరీగా, కామిరెడ్డి మోహన్‌రెడ్డిని జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. అలాగే చిత్తూరు జిల్లాకు చెందిన జి.సుధాకర్ జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,263 మంది స్వామివారిని దర్శించుకోగా 25,019 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.35 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ కోరింది.

వేడుకగా అవతారోత్సవాలు

తిరుపతి కల్చరల్: భక్తి ఉద్యమంతో సమానత్వాన్ని బోధించి సమాజాన్ని సంస్కరించిన మహనీయులు భగవద్ రామానుజాచార్యులని తిరుమల చిన్నజీయర్‌స్వామి కొనియాడారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు తలపెట్టిన శ్రీరామానుజాచార్యుల అవతార మహోత్సవాలు బుధవారం అన్నమాచార్య కళామందిరంలో వేడుకగా ప్రారంభమయ్యాయి. చిన్నజీయర్‌స్వామి హాజరై మంగళశాసనంతో అవతార మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆయన భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ ఆదిశేషుని అవతారమైన రామానుజులవారు శరణాగత భక్తిని విశేషంగా ప్రచారం చేశారన్నారు. భక్తితో భగవంతుని కొలిస్తే దివ్యత్వం కలుగుతుందని వెల్లడించారు. శ్రీమహావిష్ణువుకు ఆదిశేషుడు పాన్పుగా, ఆసనంగా ఉంటూ ప్రథమ సేవకుడిగా నిలిచాడని, రామానుజాచార్యులు ఈ మార్గమే అనుసరించారని వివరించారు. అనంతరం అహోబిలం మఠానికి చెందిన సీతారామన్ మాట్లాడుతూ ‘శ్రీరామానుజ వైభవాన్ని వెల్లడించారు. ఈ క్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సరస్వతి ప్రసాద్ బృందం ఆలపించిన సంకీర్తనలు భక్తులకు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ప్రత్యేక అధికారి రాజగోపాలరావు, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ పురుషోత్తం పాల్గొన్నారు.



అనుగ్రహ భాషణ చేస్తున్న చిన్నజీయర్ స్వామి

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

- జగన్ 2.0లో కార్యకర్తలకే ప్రాధాన్యం
- రామ్‌కుమార్‌రెడ్డి, నాగార్జున యాదవ్



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం : క్షేత్రస్థాయి నుంచే వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ తెలిపారు. బుధవారం వెంకటగిరి పట్టణంలోని నేదురుమల్లి భవన్‌లో బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి పట్టణం, రూరల్ పరిధిలోనినేతలు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ 2.0లో కార్యకర్తలకే ప్రాధాన్యమిస్తామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన భరోసాతో కేడర్ రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తోందన్నారు. వలంటీర్ల వ్యవస్థ కారణంగా ప్రజలు, పార్టీ నేతల మధ్య దూరం పెరిగిందని తెలిపారు. అదే ఎన్నికల్లో నష్టం చేకూర్చిందన్నారు. నాగార్జున యాదవ్ మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కేడర్, వలంటీర్ల వ్యవస్థీకరణకు అధ్యయనం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో వెంకటగిరి నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఎంపిక చేసిందని తెలిపారు. పార్టీ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా విజయవంతం చేయడంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయనపై జగనన్నకు సైతం పూర్తి నమ్మకం ఉందని చెప్పారు. మున్సిపల్ చైర్మన్‌పై కూటమి నేతలు కుట్రపూరితంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో రామ్‌కుమార్‌రెడ్డి ప్రతిష్ట ఇనుమడించిందని వివరించారు. కార్యసాధకుడిగా జగనన్న వద్ద మంచి పేరు తీసుకువచ్చిందని వెల్లడించారు. ఈ క్రమంలోనే పహల్‌గామ్ మృతులకు నేతలు, కార్యకర్తలు అంజలి ఘటించారు.

ప్రజా సమస్యలపై పోరాటం

సైదాపురం : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం సాగించాలని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వెంకటగిరి పట్టణంలోని ఎన్‌జేఆర్ భవనంలో డక్కిలి, బాలాయపల్లె, వెంకటగిరి మండలాలకు చెందిన నేతలు, కార్యకర్తలతో సమీక్షించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి నేతల ఆదేశాల మేరకు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాబోయే జమిలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా మళ్లీ అధికార పగ్గాలు చేపడతారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్లు ప్రసాద్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

విరామం.. వీడ్కోలు!

- పీజీ పరీక్షలు రాసి వర్సిటీని వీడిన విద్యార్థులు
- బరువెక్కిన హృదయాలతో వీడ్కోలు పలికిన స్నేహితులు
- ఆశీస్సులు అందించిన అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ, పద్మావతి మహిళా యూనివర్సిటీలకు గురువారం నుంచి సెలవులు ప్రకటించారు. పీజీ కోర్సుల పరీక్షలు ముగించుకుని హాస్టల్ నుంచి తమ సామగ్రిని తీసుకుని పలువురు విద్యార్థులు స్వస్థలాలకు బయలుదేరారు. పీజీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు బుధవారం ఎస్వీయూ ఆడిటోరియం సమీపంలో వీడ్కోలు పలికారు. మిత్రులందరూ గుమికూడి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉన్నతంగా ఎదగాలని పరస్పరం విషెస్ చెప్పుకున్నారు. రెండేళ్లుగా కళాశాల, హాస్టళ్లలో కలిసి మెలసి తిరిగిన విద్యార్థులు ఒక్కసారిగా భావోద్వేగాలకు గురయ్యారు. చిరునామాలను ఇచ్చిపుచ్చుకుంటూ సెల్ఫీలు తీసుకున్నారు.

గురువుల ఆశీస్సులతో కంటతడి

పీజీ పరీక్షలు రాసిన విద్యార్థులు చివరిసారిగా తాము విద్యనభ్యసించిన తరగతి గదుల వద్దకు చేరుకున్నారు. క్లాస్ రూమ్‌లోని మొదటి సంవత్సరం విద్యార్థులతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ తమ అధ్యాపకులను కలుసుకున్నారు. ఈక్రమంలో ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు తన వద్దకు విద్యార్థులను ఆశీర్వదించారు. గురువు ఆశీస్సులను చెమర్చిన కళ్లతో విద్యార్థులు స్వీకరించారు. అలాగే వేసవి సెలవులను పురస్కరించుకుని వర్సిటీల్లోని విద్యార్థులు తమ ఇళ్లకు బయలుదేరి వెళ్లారు. విద్యకు విరామం లభించడంతో పాఠ్యాంశాలను పునశ్చరణ చేసుకోవాలని అధ్యాపకులు సూచించారు.



బరువెక్కిన హృదయాలతో ఫ్రెండ్స్‌కు వీడ్కోలు పలుకుతున్న తోటి స్నేహితులు



విద్యార్థులకు బెస్ట్ ఆఫ్ లక్ చెబుతున్న ప్రొఫెసర్ దేవప్రసాదరాజు



ఎస్వీయూలో వీడ్కోలు కూడికలో భాగంగా సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థులు

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మే 24వ తేదీ సాయంత్రం 5గంటలలోపు ఐటీఐ.ఏపీ.జీఓవి.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను మే 26వ తేదీలోపు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో పరిశీలన చేయించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 94928 61369, 85000 21856, 94908 06942, 93989 62635 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శివ శంకర్

దక్కిలి : మండలంలోని పాతనాపాడు (కమ్మవారిపల్లి) నక్కల కాలనీలో బుధవారం ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ శివ శంకర్ కథనం మేరకు.. కాలనీకి చెందిన కరిష్మా అలియాస్ సితార (32) అనే మహిళను అదే కాలనీకి చెందిన డబ్బా రూపేష్ అనే వ్యక్తి తరుచూ వేధింపులకు గురి చేసేవాడు. దీంతో అవమానం భరించలేని మహిళ ఉరేసుకుంది. ఈ క్రమంలో మృతదేహానికి వెంకటగిరి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పహల్‌గామ్ ఘటనలో కేంద్రం విఫలం



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

చిల్లకూరు : కశ్మీర్‌లోని పహల్‌గామ్ ఘటనలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. బుధవారం గూడూరు ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉగ్రవాదులను అరికట్టడంలో కేంద్రం మీనమేషాలు లెక్కిస్తోందని ఆరోపించారు. పాకిస్తాన్‌పై యుద్ధం ప్రకటిస్తే యావత్ దేశం సహకరించేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవ చూపాలని కోరారు. మోదీ అమరావతిలో శంకుస్థాపన చేసి పదేళ్లు గడిచాయని, ప్రస్తుతం అక్కడ శ్మశాన వాతావరణం కనిపిస్తోందని మండిపడ్డారు. అప్పట్లో ఢిల్లీ నుంచి మట్టి, నీరు తీసుకుని వచ్చి చంద్రబాబు ముఖం మీద చల్లి వెళ్లారని విమర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సతీష్ కుమార్ రెడ్డి మృతదేహం

చంద్రగిరి : చంద్రగిరిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన సతీష్‌కుమార్‌రెడ్డి(38) తన బంధువులను బస్సు ఎక్కించి ఇంటికి తిరిగి వస్తుండగా విద్యానికేతన్ సంస్థకు చెందిన విద్యార్థులు బైక్‌పై వస్తూ ఢీకొట్టారు. దీంతో సతీష్‌కుమార్‌రెడ్డి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. 108లో క్షతగాత్రుడిని తిరుపతి రుయాకు తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

ఉద్యానం.. మరింత ప్రోత్సాహం



నిమ్మ చెట్లుకు కూడా డ్రిప్ పద్ధతి ఏర్పాటు చేసి ఉన్న దృశ్యం



నిమ్మ



మిరప

- పండ్లతోటలు, కూరగాయల తోటలకు భారీ రాయితీ
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

సైదాపురం: జిల్లాలో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు పెంచింది. ఇందులో భాగంగానే బడ్జెట్‌లోనూ ఉద్యానశాఖకు రూ.248 కోట్లు కేటాయించింది. జిల్లా వ్యాప్తంగా 756 హెక్టార్లలో ఉద్యాన పంటలు విస్తరించాలని లక్ష్యంగా నిర్దేశించింది. కొత్తగా తోటలు అభివృద్ధి చేసే రైతులకు మరింత ప్రాధాన్యతనిస్తోంది. వివిధ పండ్ల తోటలకు చెందిన రైతులకు రాయితీ ఇవ్వనున్నట్టు వెల్లడించింది. ఎకరా నుంచి ఐదెకరాల వరకు రైతులకు ఒకే రాయితీ అమలు చేయనుంది. ముఖ్యంగా కూరగాయ తోటలో బిందు, తుంపర్ల సేద్యం సత్ఫలితాలిస్తున్న క్రమంలో మరింత విస్తృతం చేసేందుకు నడుం బిగించింది. యంత్రాంగం కూడా దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తూ బిందు, తుంపర్ల సేద్యం వైపు రైతులు వైపు మొగ్గుచూపేలా చర్యలు తీసుకుంటోంది.



డ్రాగన్ ఫ్రూట్ తోటలు పెంచుతున్న దృశ్యం

రక్షణాత్మకమైన సాగు

ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూరగాయల నారు, కూరగాయల పంటల పెంపకం, పూల సాగును ప్రోత్సాహించేందుకు లబ్ధిదారుడికి గరిష్టంగా 4.000 వేల చదరపు మీటర్లు నీడ వలలు, పాలిహౌస్ నిర్మాణానికి 50 శాతం రాయితీ ఇస్తున్నారు. నీడ వలలు చ.మీ రూ.490 నుంచి రూ.652 వరకు ఇస్తున్నారు. మినీ ట్రాక్టర్లు, కొమ్మ కత్తిరింపులకు, పూల సాగు, ప్యాక్ హౌస్, షేడ్ నెట్‌కు రాయితీ ఇస్తున్నారు.

శాశ్వత పందిళ్ల నిర్మాణం

నాణ్యమైన తీగ జాతి కూరగాయల సాగును ప్రోత్సాహించేందుకు ఉద్యానశాఖ ద్వారా శాశ్వత పందిళ్ల నిర్మాణానికి రాయితీ ఇస్తోంది. మొత్తం ఖరీదులో 50 శాతం రాయితీ లేదా ఎకరాకు రూ.లక్ష రాయితీ ఇవ్వనుంది. మల్చింగ్ ఉద్యన పంట సాగులో కలుపు నివారణ, కూలీల ఖర్చు తగ్గించేందుకు నేలలో నీటి శాతం నిల్వకు ఒక హెక్టారుకు 50 శాతం రాయితీపై రూ.16 వేల వరకు రాయితీ అందజేయనుంది.

అసలైన లబ్ధిదారులను గుర్తించేనా?

రాజకీయ కక్ష్య సాధింపుల్లో భాగంగా అసలైన రైతులను గుర్తించే అవకాశం తక్కువేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో వారి అనుచరులకే రాయితీలు వర్తించే అవకాశం ఎక్కువగా ఉందని మదనపడుతున్నారు. అర్హులైన రైతులందరికీ ప్రోత్సాహకాలు అందించాలని పలువురు కోరుతున్నారు.

భూమి కలిగిన ప్రతి రైతూ అర్హుడే



జిల్లాలోని బీడు భూముల్లో కూడా విరివిగా పండ్ల తోటలను సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలి. రైతులు ఉద్యానశాఖాధికారి లేక రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకుల్ని సంప్రదిస్తే రాయితీ ఎలా పొందాలనే విషయాలు తెలియజేస్తారు. ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా, ఫొటో జత చేసి దరఖాస్తు సమర్పిస్తే వాటిని నేరుగా కలెక్టర్‌కు పంపుతాం. ఉద్యాన, ఉపాధి పథకాల కింద సన్న, చిన్నకారు రైతులతో పాటు భూమి కలిగిన ప్రతి రైతూ ఈ పథకానికి అర్హుడే. – దశరథరామిరెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, తిరుపతి

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నేటి నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. ఎంపిక చేసిన గ్రామీణ, మండల, జిల్లా కేంద్రాల్లో మొత్తం 50 శిబిరాలను ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్ర వేళల్లో పిల్లలకు వివిధ క్రీడల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. బుధవారం ఈ మేరకు డీఎస్‌డీఓ సయ్యద్‌సాహెబ్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఆసక్తిగల క్రీడల్లో రాణించేందుకు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాలు, సీనియర్ క్రీడాకారులు తమ ప్రాంతాల్లోని పిల్లలకు అవగాహన కల్పించి శిక్షణ శిబిరాలకు హాజరయ్యేలా సహకారం అందించాలని సూచించారు.

క్రీడ	స్థలం
ఆర్చరీ	ఓల్డ్ ఏజీ కళాశాల, కేటీ రోడ్డు, తిరుపతి కేవీకే స్టేడియం, శ్రీకాళహస్తి
అథ్లెటిక్స్	ఎస్వీయూ స్టేడియం, తిరుపతి జెడ్పీహెచ్‌ఎస్, బీఎన్ కండ్రిగ
బాక్సింగ్	జెడ్పీహెచ్‌ఎస్, తిరుచానూరు కేవీఎస్–స్పోర్ట్స్ కాంప్లెక్స్, తుమ్మలగుంట శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
బాల్ బ్యాడ్మింటన్	జెడ్పీహెచ్‌ఎస్(బాలురు), శ్రీకాళహస్తి
బాస్కెట్‌బాల్	ఏపీకేఆర్ జెడ్పీహెచ్‌ఎస్, కోట మండలం జెడ్పీహెచ్‌ఎస్ కొత్తపాళెం, కోట మండలం శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
చెస్	చెస్ కిడ్స్ అకాడమీ, బైరాగిపట్టెడ, తిరుపతి, కిడ్జ్ చెస్ అకాడమీ, తిరుచానూరు
క్రికెట్	ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ హైస్కూల్, పుత్తూరు
ఫెన్సింగ్	శ్రీదేవి కాంప్లెక్స్, తిరుపతి
ఫుట్‌బాల్	రైల్వే గ్రౌండ్, నాయుడుపేట జెడ్పీహెచ్‌ఎస్, ఎ.రంగంపేట, చంద్రగిరి మండలం కేవీఎస్, తుమ్మలగుంట, తిరుపతి ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ హైస్కూల్, పుత్తూరు రైల్వేగ్రౌండ్, రేణిగుంట
హాకీ	ఆర్‌సీఆర్ ఎంబీఏ కళాశాల గ్రౌండ్, కరకంబాడి సీఆర్‌సీ గ్రౌండ్, వెంకటాపురం, రేణిగుంట మండలం జెడ్పీహెచ్‌ఎస్, విందూర్, గూడురు మండలం
హ్యాండ్ బాల్	పోగలకుప్పయ్య గ్రౌండ్, చింతకాల్వ వడమాలపేట మండలం ఏపీకేఆర్‌ఎస్, జెడ్పీహెచ్, కోట మండలం
జూడో	జెడ్పీహెచ్‌ఎస్ బాలికలు, రేణిగుంట మండలం జెడ్పీహెచ్‌ఎస్ బాలికలు, మంగళం ట్రెండ్స్
ఖోఖో	జెడ్పీహెచ్‌ఎస్, బీఎన్ కండ్రిగ మండలం
కబడ్డీ	జెడ్పీహెచ్‌ఎస్, బీఎన్ కండ్రిగ మండలం ఓల్డ్ జూనియర్ కళాశాల గ్రౌండ్, నాగలాపురం
కరాటే	జెన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, తిరుపతి జీవకోన, సత్యనారాయణపురం, తిరుపతి శ్రీ ఎన్‌ఆర్‌ఐ ఇం. మీడియం స్కూల్, తిరుపతి
రైఫిల్ షూటింగ్	ఎస్ఎస్ఎస్‌సీ షూటింగ్ రేంజ్, తిరుపతి
స్కేటింగ్	అంగన్‌వాడి స్కూల్ గేట్ సమీపం, పుత్తూరు
తైక్వాండో	రాక్ ఫైటర్స్ క్లబ్, ఎంఆర్ పల్లి, తిరుపతి ఎస్‌బీఐ టౌన్ బ్రాంచ్, పుత్తూరు శ్రీగోవిందరాజులు హైస్కూల్, తిరుపతి ఎన్‌జీఓ హోమ్, ఎల్‌ఐసీ బిల్డింగ్, తిరుపతి
వాలీబాల్	జెడ్పీహెచ్‌ఎస్, తడ ఎస్వీ నగర్, చంద్రగిరి మండలం నరసింగాపురం, చంద్రగిరి మండలం ఏపీకేఆర్ జెడ్పీహెచ్‌ఎస్, కోట మండలం ఎస్వీయూ క్యాంపస్ స్కూల్, తిరుపతి
రెజ్లింగ్	జెడ్పీహెచ్‌ఎస్, నాయుడుపేట జెడ్పీహెచ్‌ఎస్, రాసనూరు, పెళ్లకూరు మండలం ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్, సూళ్లూరుపేట
యోగా	శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి

డీఎస్‌ఏ ఆధ్వర్యంలో..

హాకీ	ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి
ఫుట్‌బాల్	ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి
టెన్నిస్	శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
బ్యాడ్మింటన్	శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
స్విమ్మింగ్	శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
కుస్తీ	శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
స్కేటింగ్	శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
కుస్తీ	జెడ్పీహెచ్‌ఎస్, తిరుచానూరు
వాలీబాల్	ఎస్వీజేఎస్ఎం స్కూల్, తిరుపతి
హాకీ	బాలుర ప్రభుత్వ హైస్కూల్, చంద్రగిరి
హాకీ	అల్లూరి ఆదిశేషారెడ్డి స్టేడియం, గూడూరు
బ్యాడ్మింటన్	కేవీకే, శ్రీకాళహస్తి

నగలు, నగదు కోసమే హత్య



రివార్డు అందిస్తున్న డీఎస్పీ భక్తవత్సలం

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరంలో ఈనెల 10వ తేదీ జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించినట్లు డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. బుధవారం అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ... జీవకోన పరిధిలోని రాఘవేందర్ నగర్‌లో శాంతమ్మ(64) అనే మహిళ నివసిస్తోంది. వడ్డీ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. అనంతపురం కదిరి నల్లగొండకు చెందిన జగదీష్ ఆయన భార్య హర్షిత మార్చిలో శాంతమ్మ ఇంట్లో అద్దెకు దిగారు. ఆమె వద్ద నగలు, నగదును గమనించి మంచిగా ఉంటూ దగ్గరయ్యారు. పథకం ప్రకారం శాంతమ్మను హతమార్చి వాటిని అపహరించాలని కుట్రపన్నారు. ఈ క్రమంలో జగదీష్, హర్షిత తమ మిత్రులైన ఓ మైనర్ బాలుడు, జమ్మలమడుగు శశిరేఖ, గుంటూరు మురళితో కలిసి పథకం పన్నారు. రాత్రి 10గంటల సమయంలో శాంతమ్మ ఇంటికి వెళ్లి చున్నీతో గొంతు నిలిమి హతమార్చారు. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా ఆమె చీరతోనే ఫ్యాన్‌కు ఉరివేశారు. శాంతమ్మ వద్ద ఉన్న 129 గ్రాముల బంగారం, రూ.3.5లక్షల నగదును దోచుకున్నారు. 11వ తేదీన శ్రీకాళహస్తి కి వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి ఏం తెలియనట్టు ప్రవర్తించారు. చివరకు పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో వాస్తవాలు వెలుగుచూశాయి. నిందితుల నుంచి నగలు, నగదు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వెల్లడించారు. మొత్తం సొత్తు విలువ సుమారు రూ.35లక్షలు ఉంటుందని వివరించారు.

నిందితులకు ముందే నేర చరిత్ర

ఈ కేసులో ప్రధాన నిందితుడు జగదీష్ గతంలో కదిరి నల్లగొండలో స్నేహితుడిని హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నారన్నారు. అలాగే అతడిపై కిడ్నాప్, బందిపోటు కేసులు కూడా ఉన్నాయి. మరో నిందితురాలు హర్షిత తండ్రి ఉయ్యాల వెంకటరమణపై చిత్తూరు జిల్లా పరిధిలో సుమారు 17కు పైగా ఎర్రచందనం కేసులు నమోదయ్యాయని పోలీసులు వెల్లడించారు. కేసును ఛేదించిన సీఐ రామకిషోర్, ఎస్‌ఐలు లోకేష్, నాగార్జున రెడ్డి, సిబ్బంది రవి రెడ్డి, చంద్రశేఖర్, స్వయం ప్రకాష్, మురుగా రెడ్డిని డీఎస్పీ అభినందించారు. రివార్డును బహూకరించారు.

కాలువలో గుర్తు తెలియని మృతదేహం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ఆశోక్ నగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. రైల్వే పరిధిలో ఉండడంతో గూడూరు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి ఒంటిపై లైట్ బ్లూ కలర్ షాట్, తెలుపు బ్లూ కలర్ చారలు టీషర్టు ఉంది.

ఏపీఓ సరెండర్

కోట : ఉపాధిహామీ పథకం ఏపీఓ పూర్ణిమను డ్వామా పీడీకి సరెండర్ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ గోపి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విధులకు గైర్హాజరు కావడం వల్లే మంగళవారం ఆమెపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. దీనిపై పీడీ శ్రీనివాసప్రసాద్‌ను వివరణ కోరగా కార్యాలయంలో ఉద్యోగుల మధ్య మనస్పర్థల కారణంగా ఇలాంటివి జరుగుతుంటాయని, త్వరలోనే అన్నీ సర్దుకుంటాయని మాట దాటవేయడం గమనార్హం.

బ్యాంకు మేనేజర్‌పై దాడి

చంద్రగిరి: అధికార పార్టీకి చెందిన వ్యక్తులు పూటుగా మద్యం సేవించి వీరంగం సృష్టించారు. ఆపై బ్యాంకులోకి దూసుకెళ్లి మేనేజర్‌ను చితకబాదిన ఘటన బుధవారం చంద్రగిరి పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణానికి అనుకుని ఉన్న ఓ బ్యాంకులో మేనేజర్‌పై అరుణా కాలనీకు చెందిన కొంత మంది యువకులు సిబ్బంది, ఖాతాదారులు చూస్తుండగానే దాడికి తెగబడ్డారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నా, వారు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ఏం చేయలేకపోయారు. ఈ క్రమంలో మందు బాబులు రోడ్డుపై బైఠాయించి నానా హంగామా చేసినట్లుగా స్థానికులు తెలిపారు. ఈ విషయంలో సదరు పార్టీ నేతలు రంగంలోకి దిగి మేనేజర్ కేసు పెట్టకుండా ఒత్తిడి చేసినట్లు తెలిసింది. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

'నీట్'కు పటిష్ట ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ నరసింహులు

తిరుపతి అర్బన్: నీట్ నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్‌ఓ నరసింహులు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్, నీట్ సిటీ కో–ఆర్డినేటర్ హేమంత్ పాండ్య, అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారితో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ నీట్–2025ను ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం జిల్లాలో మొత్తం పది సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరుపతిలో 9 సెంటర్లు, గూడూరులో ఒక సెంటర్ ఉంటుందని చెప్పారు. మొత్తం 4,489 మంది విద్యార్థులు నీట్‌కు హాజరు కానున్నట్లు వివరించారు. ఆఫ్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షకు ఉదయం 11 గంటల నుంచి కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తామన్నారు. ఆయా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించాలని ఆదేశించారు. కస్టోడియన్ బ్యాంకుకు వచ్చిన ప్రశ్నపత్రాలను సూపరింటెండెంట్లు, పోలీసు సహకారంతో తీసుకురావాలని సూచించారు. దివ్యాంగ విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో వీల్ చైర్లు, సహాయకులను ఏర్పాటు చేయాలని కోరారు. నీట్ నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పక పాటించాలని చెప్పారు. ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోని అనుమతించమని తెలిపారు.

అంతర్రాష్ట్ర మోసగాడి అరెస్ట్

- 132 గ్రాముల బంగారం స్వాధీనం



నిందితుడు మురుగన్

తిరుమల: తిరుమలలో మాంగల్య పూజల పేరిట భక్తులను మోసం చేసే ఘరానా దొంగను వన్ టౌన్ పోలీస్ బుధవారం అరెస్ట్‌చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.13 లక్షల విలువైన 132 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తమిళనాడు రాష్ట్రం మదురైకి చెందిన మురుగన్ నాగరాజు అలియాస్ శంకరరావు మార్చి 29వ తేదీన తిరువణ్ణామలై ప్రాంతానికి చెందిన ఉచిమహాలి అనే మహిళను తిరుమలలో పరిచయం చేసుకున్నాడు. మాంగల్య పూజ చేస్తే భర్తకు, కుటుంబానికి మేలు జరుగుతుందంటూ నమ్మబలికాడు. ఆమెను మినీ షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు తీసుకెళ్లి రెండు డజన్ల మట్టి గాజులు ఇచ్చాడు. అనంతరం ఆమె నుంచి 40 గ్రాముల బంగారు మాంగల్య సూత్రం, లక్ష్మీ డాలర్ చైన్, రెండు సెల్‌ఫోన్లు తీసుకున్నాడు. పుష్కరిణికి వెళ్లి స్నానం చేసి ఆలయం ముందుకు మాంగల్య పూజకు రమ్మని చెప్పి పరారయ్యాడు. మార్చి 14వ తేదీన కోయంబత్తూరు ప్రాంతానికి చెందిన శరణ్య అనే మహిళా భక్తురాలిని మోసం చేసి ఆమె వద్ద నుంచి 80 గ్రాముల బంగారు అపహరించుకుని వెళ్లిపోయాడు. అదేవిధంగా అదే నెల 18న తిరువళ్లూరు జిల్లాకు చెందిన లక్ష్మీ అనే మహిళకు మాయ మాటలు చెప్పి 12 గ్రాముల బంగారు గొలుసును తీసుకుని మాయం అయ్యాడు. ఈ మూడు ఘటనలపై తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఎస్‌ఐలు రమేష్ బాబు, చలపతి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ముమ్మురంగా దర్యాప్తు చేపట్టారు. విచారణలో మదురైకి చెందిన మురుగన్ నాగరాజు ఈ మోసాలకు పాల్పడినట్టు గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడిపై ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల్లో సుమారు 20కి పైగా కేసులు ఉన్నట్లు విచారణలో తెలిసింది.

పెండింగ్ కేసులకు ప్రాధాన్యం



సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ

వడమాలపేట (విజయపురం) : పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. బుదవారం విజయపురం పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది డ్యూటీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. నోటీస్ బోర్డులో నూతన చట్టాలను రాసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను కోర్టు అనుమతి తీసుకుని డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ సాధిక్ ఆలీ, ఎస్‌ఐ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

దళిత వాడల్లో 'పల్లె నిద్ర'

సత్యవేడు : గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీలలో పోలీసులు పల్లె నిద్ర చేపట్టాలని, చట్టాలపై అవగాహన కల్పించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. ఆదివారం రాత్రి సత్యవేడు సీఐ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను పుత్తూరు డీఎస్పీ రవికుమార్ తో కలసి ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రహదారుల్లో స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

గంగమ్మ గుడి హుండీ లెక్కింపు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి హుండీ ఆదాయం రూ.13,50,612 లభించింది. బుధవారం ఆలయంలో హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారి ఫణిరాజశయన పర్యవేక్షణలో లెక్కించారు.43 రోజులకు గాను భక్తులు సమర్పించిన కానుకల రూపేణా ఈ ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ జయకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఈస్ట్ పోలీసులు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, సేవా కుటుంబ స్వచ్ఛంద సంస్థ సేవకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదుకోవాలి.. అండగా నిలవాలి!



రుయాలో మృతుల బంధువులతో కలసి ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి తుడా : పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాల నుంచి వలస వచ్చి కూలి పనులు చేసుకొనే ఆ కుటుంబాల్లో పెను విషాదం నెలకొంది . ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో వారికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఓరి భగవంతుడా నిన్ను నమ్మి ఎక్కడి నుంచో తిరుపతికి వచ్చి పొట్ట పోసుకుంటుంటే కనికరం లేకుండా మా జీవితాలు నాశనం చేశామా అంటూ మహిళలు బోరున విలపించారు. నా భర్తను తీసుకెళ్లావు నేను ఎలా బతకాలి స్వామి అంటూ మృతుడి శ్రీనివాసులు భార్య నారాయణమ్మ కన్నీరుమున్నీరైంది.

ఆందోళన

ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి వీధిన పడ్డ మా కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నేతలతో కలిసి మృతుల బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. తిరుపతి రుయా మార్చురీ వద్ద బుధవారం మధ్యాహ్నం నిరసన చేపట్టారు. పరిహారం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కార్మిక శాఖ కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వం స్పందించాలి



మా నా బిడ్డ వసంత్ మాకు దూరమయ్యాడు. ఇక మేము ఎలా బతకాలి. మాకు దిక్కెవరు. ప్రభుత్వం ఈ ఘటనపై స్పందించాలి. అందరిలాగే కార్మిక కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయాలి. మా పరిస్థితులను గుర్తించి మాకు అండగా నిలబడాలి. – బ్రహ్మయ్య, మృతుడు వసంత్ తండ్రి

ఎట్లా బతకాలి



తిరుపతిలో పనులు చేసుకుని బతకవచ్చనే ఉద్దేశంతో మేము ఒంగోలు నుంచి వచ్చాం. ఊరు గాని ఊర్లో మాకు తీరని దుఃఖమే మిగిలింది. ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలి. లేకుంటే మేం ఎట్లా బతకాలి. – నారాయణమ్మ, మృతుడు శ్రీనివాసులు భార్య

ఐడియాథాన్ ఆవిష్కరణల ప్రదర్శన



ప్రతిభ చాటిన విద్యార్థులతో అతిథులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఐడియాథాన్–2025పేరుతో 'స్థిరమైన పర్యావరణానికి నూతన ఆవిష్కరణలు' అనే అంశంపై బుధవారం జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. సెంటర్ ఫర్ సస్టైనబుల్ టెక్నాలజీస్ ప్రధాన శాస్త్రవేత్త ప్రొఫెసర్ హెచ్‌ఎస్ చాణక్య (బెంగళూరు) ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకోసం స్థిరమైన వనరుల వినియోగంపై ఆయన ప్రసంగించారు. అనంతరం ప్రదర్శన పోటీలలో ప్రతిభ చాటి తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల బృందాలకు వరుసగా రూ.10వేలు, రూ.6వేలు, రూ.3వేలు నగదు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, డాక్టర్ రవిశంకర్ (తిరుపతి ఐఐటీ), ఐజర్ నుంచి డాక్టర్ అంబరీష్ సక్సేనా, ప్రొఫెసర్ కాత్యాయిని, ప్రొఫెసర్ విద్యావతి, డాక్టర్ జే.సూర్యకుమార్, పర్యావరణ కార్యకర్త పి శివాజీ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

